www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 10 సెప్టెంబరు 2025 5

పశ్చిమ గోదావరి



22 నుంచి దసరా సెలవులు ఇవ్వాలి

పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

భీమవరం:దసరా ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, విద్యా క్యాలెండర్ ప్రకారం 24 నుంచి దసరా సెలవులు ఇచ్చారని, 22 నుంచి సెలవులు ఇవ్వాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి విద్యా కమిషనర్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ప్రిన్సిపల్ సెక్రటరీని కోరారు. అంతర్ జిల్లా బదిలీలు డిఎస్‌సి 2025 కంటే ముందు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతులు (తెలుగు, హిందీ, సంస్కృతం మొదలగు లాంగ్వేజ్) 2025 కంటే ముందు చేపట్టాలని కోరారు. ప్లస్‌టు పాఠశాలలో ఖాళీగా ఉన్న పిజిటిలను స్కూల్ అసిస్టెంట్ల ద్వారా వెంటనే భర్తీ చేయాలన్నారు. అలాగే ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయుల పండిట్ పిఇటి పోస్టులు అప్గ్రేడేషన్ ఫైల్ ఆమోదం చేయాలని కోరారు. డిగ్రీ కళాశాల అధ్యాపకులకు బదిలీలు నిర్వహిచాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సిఆర్‌టిలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

గిరిజనులను ముంచి

భూస్వాములకు పంచి..!

పోలవరం ఆర్అండ్ఆర్ భూసేకరణలో భారీ అవకతవకలు

ఎల్‌టిఆర్ భూములుగా కోర్టు తీర్పులిచ్చినా భూసేకరణ జాబితాలో చేరిక

గిరిజనేతర భూస్వాములకు మేలు చేసేందుకు రెవెన్యూ అధికారులు తహతహ


రెడ్డిగణపవరం రెవెన్యూ పరిధిలోని భూములకు వేరే పీసా కమిటీతో తీర్మానాలు

అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆర్‌డిఒ, తహశీల్దార్‌పై ఆరోపణలు

పట్టించుకోని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు

బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం గ్రామంలో సర్వే నెంబర్ 288లో 24.06 ఎకరాలను ఎల్‌టిఆర్ భూములుగా నిర్ధారిస్తూ 2018లో హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఆ భూములను కొనుగోలు చేయడానికి వీల్లేదని చెప్పింది. గిరిజనేతర భూస్వాముల పేరున ఆ మొత్తం భూములను ఇప్పుడు ఆర్అండ్ఆర్ భూసేకరణ జాబితాలో అధికారులు చేర్చేశారు.

రెడ్డిగణపవరం గ్రామంలో 347-1 సర్వే నెంబర్‌లో 1.47 ఎకరాలు, సర్వే నెంబర్ 480-2బి 2లో 1.92 ఎకరాలకు చెందిన భూములకు సంబంధించి గిరిజనులకు పట్టాలు ఉండటంతోపాటు వారే సాగులో ఉన్నారు. ఆర్అండ్ఆర్ భూసేకరణ మొదటి జాబితాలో ఈ భూములను పెట్టారు. దీనిపై అక్కడి ప్రజలు అభ్యంతరం చెప్పడంతో తొలగించి మళ్లీ రెడ్డిగణపవరం పంచాయతీ పరిధిలోని బెడదనూరు పీసా కమిటీ ద్వారా అడ్డగోలుగా తీర్మానాలు చేయించేశారు.



THE HON'BLE SRI JUSTICE P. NAVEEN RAO

WRIT PETITION No.39800 OF 2018

ORDER:

Heard.

2. Land acquisition proceedings are set in motion for acquiring lands for Chintalapudi Lift Irrigation Scheme. On 24.08.2018, notification under Section 21 of the Right to Fair Compensation and Transparency in Land Acquisition, Rehabilitation and Resettlement Act, 2013 was issued calling upon all the interested persons to file objections on the proposed decision of the Government to take possession of the land and to settle the claims [illegible] pursuant to the notification, petitioner claimed to have filed objections before the competent authority contending that names of persons against whom the land to an extent of Acs.24.06 cents in Survey No.288/1A1 of Reddyganapavaram Village, Buttaigudem Mandal, are non-tribals and are not entitled to receive compensation and in fact L.T.R. case is pending before the agent to Government against the claim of ownership by the unofficial respondents, whose names are reflected in the land acquisition proceedings. Alleging inaction on the objections filed by petitioner and that the respondents are taking steps to pay compensation to the ineligible persons, this Writ Petition is filed.

3. Learned Government Pleader for Land Acquisition stated that so far no orders are passed pursuant to the notification, dated

288 సర్వేనెంబర్‌లో ఉన్న 24.06 ఎకరాలను ఎల్‌టిఆర్ భూములుగా నిర్ధారించి కోర్టు ఇచ్చిన తీర్పు కాపీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న సర్వే నెంబర్లలో భూములే కాదు.. గిరిజనులకు సంబంధించిన వందల ఎకరాల భూములను ఈ విధంగా పోలవరం ప్రాజెక్టు ఆర్అండ్ఆర్ భూసేకరణలో చేర్చి రెవెన్యూ అధికారులు తీవ్ర అవతకతవకలకు పాల్పడుతున్న పరిస్థితి ఉంది. పోలవరం ప్రాజెక్టుతో నిర్వాసితులవుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని విఆర్‌పురం, కూనవరం మండలాల్లోని 36 గ్రామాల ప్రజలను తరలించేందుకు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో 7,100 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం పూనుకుంది. దీనిలో 6,700 ఎకరాలు భూమికి భూమి కింద, మరో 400 ఎకరాలు కాలనీల నిర్మాణానికి అవసరమని అధికారులు చెబుతున్నారు. ఏజెన్సీలో గిరిజనులకు సంబంధించిన భూములను సేకరించడానికి చట్టాలు అంగీకరించవు. గిరిజనేతరుల భూములను మాత్రమే సేకరించాలి. దీంతో అధికారులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై గిరిజనులకు సంబంధించి నవి, ఎల్‌టిఆర్ భూములను గిరిజనేతరులకు చెందిన భూస్వాముల భూములుగా చూపిస్తూ జాబితాలో చేరుస్తున్న పరిస్థితి ఉంది. ఎకరాకు రూ.15 లక్షల వరకూ ప్రభుత్వం పరిహారం ఇస్తోంది. దీంతో రెవెన్యూ అదికారులు, అధికార పార్టీ నాయకులు గూడుపుఠాణికి దిగారు. గిరిజనులకు చెందిన భూములను గిరిజనేతరులవిగా చూపిస్తూ పరిహారం సొమ్ము దోచుకునేందుకు సిద్ధమయ్యారు. దీని కోసం ప్రత్యేకంగా నలుగురైదుగురు దళారులు అధికారులతో కలిసి నిత్యం పని చేస్తున్నారు.

తప్పుడు పద్ధతిలో పీసా కమిటీ తీర్మానాలు

ఏజెన్సీ ప్రాంతంలో భూసేకరణ చేయాలంటే గ్రామసభ తీర్మానం తప్పనిసరి. ఆయా గ్రామాల్లో సేకరిస్తున్న భూములకు సంబంధించిన గ్రామసభ నిర్వహించి తర్వాత నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. గిరిజనుల భూములను వేరే వారి పేరున జాబితాలో పెట్టడంతో రెడ్డిగణపవరం వంటి గ్రామాల్లో ప్రజలు అభ్యంతరాలు చెప్పారు. దీంతో వాటిని తొలగిస్తున్నట్లు చెప్పి నిబంధలనకు విరుద్ధంగా మళ్లీ జగ్గిశెట్టిగూడెం రెవెన్యూ పీసా కమిటీతో తీర్మానాలు చేయించిన పరిస్థితి ఉంది. రెడ్డిగణపవరం రెవెన్యూ భూములను జగ్గిశెట్టిగూడెం పీసా కమిటీతో ఎలా తీర్మానం చేయిస్తారో అర్థం కాని పరిస్థితి ఉంది. ఇలా ఒకటి, రెండు కాదు.. వందల ఎకరాలకు సంబంధించి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా మూడెకరాలు భూమి ఉంటే నాలుగెకరాలు ఉన్నట్లు నోటిఫికేషన్‌లో పెడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదనంగా వచ్చే సొమ్మును పంచుకునేందుకు అంతా గూడుపుఠాణి పన్నినట్లు తెలుస్తోంది. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ఆర్అండ్ఆర్ భూసేకరణలో భారీ అవకతవకలు జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకున్న దాఖలాలు ఉండటం లేదు. గిరిజనులకు తీరని అన్యాయం చేస్తున్నప్పటికీ ప్రజాప్రతినిధులు నుంచి సైతం సరైన స్పందన లేకుండాపోయింది. ఆర్‌డిఒ, తహశీల్దార్లపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గిరిజనులకు సంబంధించిన భూములను గిరిజనేతర భూస్వాములవిగా పేర్కొంటూ రూ.వందల కోట్ల అవినీతికి పాల్పడుతున్న పరిస్థితి ఉంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి వద్దు

సిఎం చంద్రబాబుకు అంగర లేఖ

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లాలోని అధికార టిడిపి అసంతృప్తులతో సతమతమవుతోంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో టిడిపి, జనసేన మధ్య సమన్వయం కొరవడి విభేధాలు పొడసూపిన సంగతి తెలిసిందే. ఇటీవల టిడిపి భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతా రామలక్ష్మిపై ఆ నియోజకవర్గ పరిధిలోని వీరవాసరం మండలానికి చెందిన బిసి నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ తిరుగుబావుటా ఎగరేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో టిడిపి అధిష్టానం పొరపాటో, లేక స్థానిక రాజకీయాల ప్రభావమోగాని సీనియర్ నేతలు సైతం అసంతృప్తికి గురయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయి. తాజాగా రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి తనకు వద్దని మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ సిఎం చంద్రబాబుకు మంగళవారం లేఖ రాయడమే దీనికి నిదర్శనం. లేఖలోని అంశాలను ఆయన మంగళవారం మీడియాకు విడుదల చేశారు. టిడిపి ఆవిర్భావం నుంచి నేటి వరకూ తాను పార్టీలో కష్టపడి పని చేస్తున్నానని తెలిపారు. ఎన్‌టిఆర్ హయాంలో పాలకొల్లు ఎంపిపిగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్‌పి వైస్ ఛైర్మన్‌గా పని చేశానని, రెండుసార్లు ఎంఎల్‌సిగా అవకాశం కల్పించారని తెలిపారు. ఎంఎల్‌సిగా ఉన్న సమయంలో ప్రభుత్వ విప్‌గా మూడేళ్లు, రాష్ట్ర శాసనసభ లెజిస్లేటివ్ లైబ్రరీ ఛైర్మన్‌గా ఐదున్నర సంవత్సరాలు అవకాశం దక్కిందన్నారు. ఈ క్రమంలో తాను పార్టీ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని, రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు సభ్యుని పదవి మాత్రం వద్దని ఆ లేఖలో పేర్కొన్నారు. ఎంఎల్‌సి స్థాయిలో పని చేసిన నేతకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కట్టబెట్టినా సముచితంగా ఉండేదని, డైరెక్టర్ పదవి కట్టబెట్టడం జీర్ణించుకోలేకే అంగర పదవిని తిరస్కరించారని ఆయన అనుయాయులు చెబుతున్నారు.

ముత్యాలమ్మ పూరి గుడిసె దగ్ధం



వివరాలు సేకరిస్తున్న ఎఫ్ఎల్ఎస్ టీమ్

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎఎస్‌పి, డిఎస్‌పి

కేసును పూర్తిస్థాయిలో విచారిస్తాం

ప్రజలు సహకరించాలి

ఎఎస్‌పి వి.భీమారావు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులో నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి పూరి గుడిసె దగ్ధానికి సంబంధించి కేసును పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని, ప్రజలందరూ సంయమనంతో ఉండాలని ఎఎస్‌పి వి.భీమారావు సూచించారు. గ్రామంలోని మెయిన్ రోడ్డులో వంద సంవత్సరాల పైబడి నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి పూరి గుడిసె ఉంది. సోమవారం అర్ధరాత్రి ఇది అనూహ్యంగా దగ్ధమైంది. తెల్లవారుజామున స్థానికులు దీన్ని గుర్తించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలియగానే పోలీసు ఉన్నతాధికారులు రంగంలోకి దిగి ఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకోవడంతోపాటు ఎటువంటి ఉద్రిక్తత, ఆందోళనలు లేకుండా చర్యలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త గురుజు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎఎస్‌పి భీమారావు, డిఎస్‌పి శ్రీవేద అరవింద్, సిఐ యాదగిరి, ఎస్ఐ జి.వాసు, సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విజయవాడ నుంచి వచ్చిన ఎఫ్ఎల్ఎస్ సిబ్బంది, భీమవరం నుంచి వచ్చిన క్లూస్‌టీమ్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్, విద్యుత్ శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



సంఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న విప్ నాయకర్

ఈ సందర్భంగా మొగల్తూరు పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఎస్‌పి, డిఎస్‌పి మాట్లాడారు. ప్రజలు ఈ ఘటనపై విచారణకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వ్యవహరించాలని సూచించారు. ఆలయ ధర్మకర్త శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసులు సకాలంలో స్పందించారని, పోలీస్ విచారణకు తాము పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. ఉప సర్పంచి బోనం నరసింహారావు మాట్లాడుతూ పోలీసులు సకాలంలో స్పందించారన్నారు. ఘటనా ప్రాంతాన్ని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ తదితరులు సందర్శించారు. విచారణ వేగవంతం చేయాలని పోలీసులను కోరారు.

రైతులు తక్కువ ఎరువులు వినియోగించాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎరువులు ఎంత తక్కువగా వినియోగిస్తే రైతులకు, రాష్ట్రానికి అంత ప్రయోజనం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం యనమదుర్రులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి కలెక్టర్ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొని ఇ పంట నమోదు, అధిక ఎరువుల వినియోగం అనర్థాలు, పిఎం ప్రణామ్ తదితర కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ తొలుత భోగిరెడ్డి కృష్ణమూర్తి పంట పొలం, ఇ పంట నమోదు కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి

తగ్గించి ఆధునికతో సేంద్రియ పద్ధతులను మేళవించి సాగు చేపట్టాలన్నారు. రైతులకు ఎక్కడ ఇబ్బంది లేకుండా ఎరువుల లభ్యతపై ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లతో ఎప్పటికప్పుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమన్వయం చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు. జిల్లాలో 42 డ్రోన్లు అందుబాటులో ఉంచామని, డ్రోన్ పోర్టల్‌లో రిక్వెస్ట్ పెట్టుకుని వినియోగించుకోవాలన్నారు. కృత్రిమ ఎరువులు తగ్గించుకోగలిగితే రైతులకు మేలు చేసేలా కేంద్ర ప్రభుత్వం గ్రాంట్‌ను రాష్ట్రానికి అందించడం జరుగుతుందన్నారు. ఒక యూరియా బస్తా అసలు ఖరీదు రూ.2,200 అవుతుందని, దీన్ని కేంద్రం సబ్సిడీపై రూ.1,985లకు అందిస్తోందన్నారు. పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కెఎస్ఎస్.శ్రీనివాసరావు,ఎఒలు వైవిఎస్.ప్రసాద్, జెడ్ బాల నాగేశ్వరమ్మ, సర్పంచి రామ్మూర్తి పాల్గొన్నారు.



భీమవరం : సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నేతలు

యూరియా కొరతను అరికట్టాలి

వైసిపి నేతల నిరసన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశానికి రైతులు వెన్నెముక వంటివారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం వైసిపి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద అన్నదాత పోరు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ ఖతిబ్ కౌసర్ భానోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ రైతు వెన్నెముక విరిచేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుకు సరైన గిట్టుబాటు ధర ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరసాపురం పార్లమెంట్ అబ్జర్వేటర్ ముదురూరి మురళీ కృష్ణంరాజు, మాజీ ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, వైసిపి పట్టణ అధ్యక్షుడు కె.ధర్మరాజు, కర్రి భాస్కర్‌రావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం : రైతులు యూరియా, ఎరువుల కోసం నానా ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు విమర్శించారు. అన్నదాత పోరులో భాగంగా వైసిపి కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ భారీ ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనలో మాజీ మంత్రి చెరుకువాడ రంగనాధరాజు, గుడాల గోపితో పాటు నరసాపురం, పాలకొల్లు, ఆచంట పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆర్‌డిఒ దాసిరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదునూరి, రంగనాదరాజు, గోపి మాట్లాడుతూ బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి, ఎరువులు పక్కదోవ పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఛైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, ఎంపిపి ఎం.సోని, కె.నాని, ఎస్.సురేష్ బల్లిమస్తాన్, వైకెఎస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని వైసిపి నాయకులు విమర్శించారు. అన్నదాత పోరుబాటలో భాగంగా స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద వైసిపి నాయకులు నిరసన తెలిపారు. కార్యాలయంలోకి వెళ్లకుండా పోలీసులు భారికేడ్లు పెట్టి అడ్డుకోవడంతో నేతలు నినాదాలు చేశారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయానికి వినతిపత్రం ఇవ్వడానికి భీమవరం నియోజవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకట్ రాయుడు, ఉండి కన్వీనర్ నరసింహరాజు, ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాలతోపాటు పలువురు నాయకులు అనుమతించారు. ఆర్‌డిఒ అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాదిరాజు రామరాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

23వ తేదీ వరకూ సీసలిలో 144 సెక్షన్

ప్రజాశక్తి - కాళ్ల

సీసలిలో ఈ నెల 23వ తేదీ వరకూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసులు మంగళవారం తెలిపారు. గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం పక్కన ఉన్న పోరంబోకు స్థలం విషయమై సోమవారం రాత్రి జరిగిన ఘటనపై గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు వివరించారు. నిరసన కారులను కట్టడి చేసేందుకు అల్లర్లకు తావు లేకుండా పోలీసులు సీసలి చుట్టూ పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. సీసలిలోకి వెళ్లే వారిని పూర్తిస్థాయిలో తనిఖీ చేసి పంపిస్తున్నామన్నారు. గ్రామంలో ఆయుధాలు, వెపన్లు కలిగి ఉండరాదన్నారు. ర్యాలీలు, మీటింగులు పెట్టరాదని, ఐదుగురికి మించి ఎవరూ గుంపుగా ఉండ కూడదని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే పీడీ కార్యాలయాల ముట్టడి

విఒఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం

వెలుగు విఒఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పీడీ కార్యాలయాలు ముట్టడిస్తామని విఒఎల సంఘం (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం వెలుగు విఒఎల జిల్లా మహాసభ నాయకురాలు నాగిడి గోవిందమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ వెలుగు విఒఎలతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందన్నారు. ప్రభుత్వం యాప్‌ల ద్వారా పనిభారం పెంచుతోందని, సెల్ ఫోన్లు ఇవ్వడం లేదని విమర్శించారు. జూమ్ మీటింగ్ పేరుతో విఒఎలను రాత్రీ పగలూ వేధిస్తున్నారని, డ్యూటీ సమయంలో జూమ్ మీటింగ్ వేయాలని కోరారు. ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం విఒఎల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ విఒఎలు హక్కులకై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పోరాటాలకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మల నాయుడు, గోవిందమ్మ, లక్ష్మి, ప్రశాంతి, విజయలక్ష్మి, బంగారు వరలక్ష్మి, డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విఒఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

కౌలు రైతుల సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

పోడూరు:కవిటంలోని పరశురామరెడ్డి కళ్యాణ మండపంలో జరిగిన ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా 4వ మహాసభలో సంఘం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఉండుర్తి శ్రీనివాసు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మామిడిశెట్టి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా కేతా గోపాలన్, కవురు శ్రీనివాస్, ఇంజేటి శేఖర్‌బాబు, పెచ్చెట్టి నర్సింహమూర్తి, కమిటీ సభ్యులుగా మరో 16 మందిని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. గత ప్రభుత్వం తెచ్చిన కౌలు చట్టం రద్దు చేసి, కౌలు రైతులందరికీ భూయజమాని సంతకం, ఆధార్‌తో సంబంధం లేకుండా ప్రభుత్వమే గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు, పంట నష్టం, పంటల బీమా కౌలురైతులకే ఇవ్వాలని, పంట, మురుగు కాలువలను ఆధునికీకరించాలని తదితర వాటిని మహాసభ తీర్మానాలు చేసింది.



శ్రీనివాస్



రామాంజనేయులు

పాలకొల్లులో ఇఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

పాలకొల్లు:ప్రభుత్వం రైస్ మిల్లు, ఇతర కార్మికులకు ఇఎస్ఐ సేవలు అందించాలని రైస్ మిల్లు కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. కార్మికుల నుంచి వందల రూపాయలు ప్రతినెలా కట్టించుకుంటున్న ప్రభుత్వం వారి సేవలను మరిచిందని విమర్శించారు. కొన్ని సంవత్సరాలుగా వైద్య సేవలందించిన డాక్టర్ ఆర్‌వి.సుబ్బారావు రిటైర్డ్ అయ్యారని, ఆయన స్థానంలో ఇప్పటివరకూ ఎవరినీ నియమించలేదని తెలిపారు. కార్మికులకు అనారోగ్య సమస్యలు వస్తే 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న హాస్పటల్‌లో సేవలు పొందాలనడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వం స్పందించి పాలకొల్లు కేంద్రంగా డిస్పెన్సరీ ఏర్పాటు చేయకపోతే ఆందోళన చేస్తామని వాసుదేవరావు డిమాండ్ చేశారు. రైస్ మిల్లు కార్మిక సంఘం కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, టి.వెంకటేష్, వి.రత్తయ్య, ఎం.శ్రీనివాస్, టి.సూర్యారావు, పురుషోత్తం పాల్గొన్నారు.

రాష్ట్ర నూర్ బాషా దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా షేక్ సయ్యద్ ఆలీ జిన్నా

పెనుమంట్ర:రాష్ట్ర నూర్ బాషా దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా షేక్ సయ్యద్ ఆలీ జిన్నాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని పొలమూరుకు చెందిన షేక్ సయ్యద్ ఆలీ జిన్నా 2009 నుంచి టిడిపిలో చురుకైన పాత్ర పోషించారు. ఎనిమిదేళ్లు టిడిపి గ్రామ కార్యదర్శిగా, ఐదేళ్లు పెనుమంట్ర మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులుగా పనిచేశారు. 2019లో ఆచంట నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులుగా వ్యవహరించారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి విజయానికి తన వంతు కృషి చేశారు. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఆశీస్సులతో రాష్ట్ర నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆయన నియమితులయ్యారు. షేక్ సయ్యద్ ఆలీ జిన్నా మాట్లాడుతూ నూర్ బాషా దూదేకుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనను టిడిపి అధ్యక్షులు వెలగల బుల్లిరామిరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి, బీరా నర్సింహమూర్తి, గణపతినీడి రాంబాబు, క్లస్టర్ కన్వీనర్ చింతపల్లి రామకృష్ణ, పొలమూరు సొసైటీ అధ్యక్షులు కండిబోయిన శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షులు గుడాల వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.



షేక్ సయ్యద్ ఆలీ జిన్నా

ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ

భీమవరం :ఉపాధి కూలీలకు మూడున్నర నెలలు గడుస్తున్నా నేటికీ వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా డ్వామా పీడీ సిహెచ్.అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పని చేసిన 15 రోజుల్లో వేతనాలు ఇవ్వాలని చట్టంలో ఉన్న విషయం గ్రామీణాభివృద్ధి శాఖామంత్రికి తెలీదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉపాధి కూలీల ఇబ్బందులను గుర్తించి వేతనాలు వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. డ్వామా పీడీ అప్పారావు మాట్లాడుతూ వారం రోజుల్లోపు వేతనాలు అధించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బల్ల చిన వీరభద్రరావు, శేషపు అశ్రియ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు జక్కంశెట్టి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.




డ్వామా పీడీకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

భీమవరం మార్కెట్ యార్డ్‌లోనే కలెక్టరేట్ నిర్మించాలి

రిలే నిరాహార దీక్ష చేపట్టిన శ్రీనివాస్, సత్తిబాబు

భీమవరం టౌన్:పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్‌ను భీమవరం మార్కెట్ యార్డులోనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ ప్రకాశం చౌక్ సెంటర్లో రిలే నిరాహార దీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలో పాల్గొన్న జనసేన నాయకుడు రాట్నాల శ్రీనివాస్, న్యాయవాది జవ్వాది సత్తిబాబు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం 124 జిఒను విడుదల చేసి భీమవరం మార్కెట్ యార్డులోనే కలెక్టరేట్‌ను నిర్మించాలని రూ.100 కోట్ల నిధులు కూడా మంజూరు చేయించిందన్నారు. అయితే ఎన్నికలు రావడంతో నిర్మాణం ప్రారంభం కాలేదని తెలిపారు. ప్రస్తుతం భీమవరం కలెక్టరేట్‌ను ఉండి నియోజకవర్గానికి తీసుకెళ్లే విధంగా ఎంఎల్ఎ రఘురామ కృష్ణ రాజు ప్రయత్నిస్తున్నారని, భీమవరంపై ఆయన పెత్తనం ఏంటని ప్రశ్నించారు. భీమవరం నుంచి కలెక్టరేట్‌ను తరలించాలని చూస్తే ప్రాణాలను ఇస్తామని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని శ్రీనివాస్, సత్తిబాబు హెచ్చరించారు.



దీక్ష చేస్తున్న శ్రీనివాస్, సత్తిబాబు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

టిడ్కో ఇళ్లలో ఎ3 బ్లాక్‌లో తాగునీరు, చెత్త సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. కమిషనర్ రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ 20 రోజులుగా ఎ3 బ్లాక్‌లో తాగునీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా కాలయాపన చేస్తున్నారన్నారు. స్నానాలకు, వాడకానికి బయట నుంచి వాటర్ టిన్నులు కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోయారు. అలాగే అపార్ట్మెంట్ వద్ద వాడిని చెత్త పడేయడం వల్ల దోమలు, దుర్వాసనతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి తాగునీరు, చెత్త సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జనాలు సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.త్రిమూర్తులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, మావుళ్ల దాసు, కాలనీవాసులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు, నేతలు

సీసలిలో 144 సెక్షన్ అమలు : సిఐ

కాళ్ల : సీసలి గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మంగళవారం నుండి 15 రోజులపాటు గ్రామంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఆకివీడు సిఐ జగదీశ్వరరావు, తహశీల్దార్ జి.సుందర్ సింగ్ తెలిపారు. సీసలి గ్రామంలో పోరంబోకు స్థలం విషయమై సోమవారం రాత్రి జరిగిన విషయంలో పలువురికి గాయాలైన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం కాళ్ల తహశీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాలను పెద్దలతో పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ శాఖ అధికారులు శాంతి సమావేశం నిర్వహించారు. సదరు వివాదాస్పద భూమిని ఇరిగేషన్ అధికారులు స్వాధీన పరుచుకోవాలని తహశీల్దార్ ఇరిగేషన్ ఎఇ ఫణిశంకర్కు సూచించారు. దీనిలో భాగంగా ఎటువంటి గొడవలు పడకుండా శాంతియుతంగా ఉండాలని ఇరువైపుల వచ్చిన పెద్దలకు సూచించారు.

రేపు డిగ్రీ కాలేజీలో ఉద్యోగ మేళా

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో ఈనెల 11వ తేదీన జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉద్యోగమేళ నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి మంగళవారం తెలిపారు. ఉద్యోగ మేళాలో అపోలో ఫార్మసీ గ్రూప్ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని అన్నారు. ఈ సంస్థలలో సుమారు వందకుపైగా ఖాళీలు ఉన్నాయన్నారు. 2021-25 సంవత్సరాల మధ్య బిఎస్సి, ఇంటర్ మీడియట్ లేదా డిగ్రీ పాసైన అభ్యర్థులు అర్హత కలిగి ఉంటారన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 11న గురువారం స్థానిక డిగ్రీ కాలేజీలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. వివరాల కోసం 9866215054 నెంబర్కు ఫోన్ చేయాలని తెలిపారు.

మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తు నాశనం : ఎస్ఐ

భీమవరం టౌన్ : మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని, మాదకద్రవ్యాల నివారణకు సమిష్టిగా కృషి చేద్దామని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్ఐ పి.వి.ఉమామహేశ్వరరావు అన్నారు. భీమవరం డిఎన్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో ఎక్సైజ్ శాఖ, వాకర్స్ అసోసియేషన్, మార్నింగ్ కాఫీ క్లబ్, ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ అనర్ధాలపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిఎన్ఆర్ కళాశాల అసిస్టెంట్ సెక్రటరీ బోసు రాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : మత్తు మందులు శరీరాన్ని, మనసును నాశనం చేస్తాయని సైకాలజిస్ట్ టి.గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆల్కహాల్, డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు ఆటో డ్రైవర్లకు యాగర్లపల్లిలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సెలర్ పాస్టర్ పొద వెంకటేష్, ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు కట్రెడ్డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు శ్రీవెంకటేశ్వర బధిర ఉన్నత పాఠశాల వార్షికోత్సవం

భీమవరం : శ్రీవెంకటేశ్వర బధిర ఉన్నత(మూగ, చెవుడు) పాఠశాల 40వ వార్షికోత్సవ వేడుకల ఏర్పాట్లు పూర్తయ్యాయని, బుధవారం ఉదయం వేడుకలు ప్రారంభమవుతాయని సంఘం గౌరవాధ్యక్షులు చెరుకువాడ రంగసాయి, అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీనివాస వర్మ, సి.హెచ్.తాతారావు తెలిపారు. మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో వివరాలను వెల్లడించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 40వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, మండలి డిప్యూటీ ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ, డిఎన్ఆర్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నరసింహారాజు, గాదిరాజు సత్యనారాయణరాజులతో పాటు 400 మంది పూర్వ విద్యార్థులు, తదితర ప్రముఖులు హాజరవుతున్నారని వారు తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలాభివృద్ధి

పంచాయతీ కార్యాలయం ప్రారంభంలో ఎంఎల్ఎ అంజిబాబు

భీమవరం టౌన్ : కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలాభివృద్ధి సాధ్యమని, గ్రామాలను ఉద్యమ ప్రాతిపదికన అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మండలంలోని తోకతిప్ప గ్రామంలో సుమారు రూ.18 లక్షలతో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎంఎల్ఎ అంజిబాబు, టిడిపి పొలిట్బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ప్రారంభించారు. రూ.18 లక్షలతో అధునాతనమైన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నామని, ఈ గ్రామాల్లోని సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని అన్నారు. త్వరలోనే మంచినీటి సమస్యను తీర్చేస్తామని, రెండు ప్రధాన రహదారులకు రోడ్లు వేస్తామని ఎంఎల్ఎ తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రైతులకు సత్వర సమాచార సేవలు

మార్టేరు ఫారం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్

పెనుమంట్ర : మారుతున్న కాలంలో వచ్చిన మొబైల్ విప్లవం దృష్ట్యా ఉంచుకుని రైతులకు వ్యవసాయ సమాచారాన్ని వేగవంతంగా చేర్చడం కోసం ప్లాంట్ వైజ్ ప్లస్ మొబైల్ అప్లికేషన్ పై మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇస్తున్నట్లు మార్టేరు ఫారం సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని మార్టేరు (నెగ్గిపూడి) ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, కాబి ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యాన పరిశోధన ప్రాంగణంలో శిక్షకులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. కాబి ఇంటర్నేషనల్ సంస్థ అగ్రి-డిజిటల్ కోఆర్డినేటర్ డాక్టర్ మధు మంజరి అతిథిగా హాజరయ్యారు. సహాధ్యక్షులు డాక్టర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ మారుతున్న కాలమాన పరిస్థితులు, మొబైల్ విప్లవ దృష్ట్యా వ్యవసాయ సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు చేరవేయాలనే ఉద్దేశంతో కాబి ఇంటర్నేషనల్ సంస్థ వారు ప్లాంట్వైజ్ ప్లస్ అనే మొబైల్ అప్లికేషన్ను తీసుకువచ్చిందని తెలిపారు. ఈ డిజిటల్ సాధనాన్ని రైతులకు పూర్తి స్థాయిలో చేరవేయాలని రెండు రోజులపాటు 'మాస్టర్ శిక్షకుల శిక్షణ కార్యక్రమాన్ని' నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్టేరు, నెల్లూరు, బాపట్ల పరిశోధనా స్థానాలకు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యాపీఠం ర్యాలీ

నరసాపురం : పట్టణంలో విద్యాశాఖ ఆధ్వర్యాన ఎపి సార్వత్రిక విద్యాపీఠం(దూర విద్యా విధానం)పై చదువు మళ్లీ కొనసాగిద్దాం.. బంగారు భవిష్యత్ నిర్మించుకుందాం అంటూ ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. విద్యాపీఠంలో అందిస్తున్న కోర్సులపై యువతకు అవగాహన కల్పించారు. పది, ఇంటర్ చదవాలనుకునే విద్యార్థులు బాలిక ఉన్నత పాఠశాలల్లో అడ్మిషన్లు తీసుకోవాలని ఎంఇఒ పుష్పరాజు సూచించారు. మళ్లీ చదువులు సాగించడం వల్ల బంగారు భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవచ్చునని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

థింక్ ఇండియా దక్షిణాపథ్ సమ్మిట్ పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం : థింక్ ఇండియా ఆధ్వర్యాన ఈనెల 20, 21వ తేదీల్లో తమిళనాడులోని ఐఐటి మద్రాసు(ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్)లో నిర్వహించనున్న దక్షిణాపథ్ సమ్మిట్ పోస్టర్ను ఎపి నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యంగా దేశంలోని ప్రతిభను ఎదుర్కొంటున్న అత్యంత ముఖ్యమైన సామాజిక, ఆర్థిక, సాంకేతిక సవాళ్లను పరిష్కరించడంలో ఈ సమ్మిట్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, అసోసియేట్ డీన్లు డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ కార్తికేయ శర్మ పాల్గొన్నారు.

యూరియా కొరత ఉందా

వైసిపి నేతలకు డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ ప్రశ్న

నరసాపురం: నరసాపురంలో యూరియా కొరత ఉందా అంటూ డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ(చిన్న) వైసిపి జిల్లా అధ్యక్షులు, నరసాపురం మాజీ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజును సూటిగా ప్రశ్నించారు. మంగళవారం పీఎసిఎస్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరిలోని డిసిఎంఎస్ పరిధిలోని 21 షాపుల్లో 206 టన్నుల వరకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఎస్టియు నూతన కమిటీ ఎన్నిక


పాపారావు


గణేష్

ప్రజాశక్తి - కాళ్ల

ఎస్టియు సంక్షేమం కోసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎస్టియు నూతన మండల అధ్యక్షులుగా ఎన్నికైన పాలారి పాపారావు పేర్కొన్నారు. బొండాలలో సోమవారం ఎస్టియు మండలశాఖ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండల నూతన అధ్యక్షులుగా పాలారి పాపారావు, ప్రధాన కార్యదర్శిగా వంకా గణేష్, ఆర్థిక కార్యదర్శిగా నాగప్రసాద్ని పలువురు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఎన్నిక పట్ల ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ, రాష్ట్ర కార్యదర్శి జానకీరామరాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వి.జనార్ధన రావు, మండల ఆర్థిక కార్యదర్శి నాగప్రసాద్, మోహన్బాబు, సూర్యనారాయణ, వంశీకృష్ణ, రామకృష్ణరాజు, పి.ప్రసాద్, మహిళా కార్యదర్శులు ప్రశాంతి, గీత, విజయలక్ష్మి, సుభద్ర, కనకదుర్గ హర్షం వ్యక్తం చేశారు.

బాల్య వివాహరహిత సమాజానికి కృషి

ఐసిడిఎస్ ఆధ్వర్యాన అవగాహన


ఆచంటలో అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ అధికారి కృష్ణకుమారి

ప్రజాశక్తి - ఆచంట

బాల్య వివాహరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పెనుమంట్ర ఐసిడిఎస్ అధికారి ఎ.కృష్ణకుమారి అన్నారు. ఆచంట వేమవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం అంశాలపై మంగళవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసినా.. ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, నేరం రుజువైతే వివాహం చేసిన వారికి, ఇరుపక్షాల తల్లిదండ్రులకు జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదన్నారు. బాల్యంలో వివాహం చేయడం వల్ల ఎనీమియాతో బాధపడుతుంటారని, చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల వచ్చే ఇబ్బందుల గురించి కిశోర బాలికలకు వివరించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు, పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల ఏర్పడే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాలికలు పరిశుభ్రత పాటించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి కిశోర బాలికలకు వివరించారు. స్వయం ప్రతిపత్తి సాధించిన తర్వాత కిశోర బాలికలు వివాహం గురించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : ఆడపిల్లలు, మహిళలు సమాజంలో వివక్షకు దూరం కావాలంటే అది ఒక విద్యతోనే సాధ్యమని ఐసిడిఎస్ పిడి డి.శ్రీలక్ష్మి అన్నారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి న్యూ సంకల్పం ప్రోగ్రాంలో భాగంగా 12వ రోజు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్లో జరిగింది. ముందుగా స్కిన్ డెవలప్మెంట్ ఆఫీసర్ డాక్టర్ లోకమాన్య మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలు వారికిచ్చే లోన్స్తో స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా ఎదగాలని, తమ సంస్థ ద్వారా ఇచ్చే ట్రెయినింగ్ల గురించి వివరించారు. వన్ స్టాప్ సెంటర్ స్టాఫ్ మహిళలకు అత్యవసర సమయాల్లో తమ ద్వారా లభించే సేవలను గురించి తెలియజేశారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ తరపున నడపబడుతున్న వివిధ శాఖల పనితీరును గురించి వివరించారు. కార్యక్రమంలో కిశోర బాలికలు, మహిళలు, అంగన్వాడీలు, సూపర్వైజర్స్ పాల్గొన్నారు.

నరసాపురం : బాల్య వివాహాలను ప్రోత్సహించకుండా వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని కొప్పర్రు సెక్టార్ ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు ఎన్.పద్మావతి అన్నారు. కొప్పర్రులోని పీతలవానిగర్వు సామాజిక భవనంలో మహిళలకు, కిశోర బాలికలకు మంగళవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలల సంరక్షణాధికారి నెహేమియా మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, అనర్థాలను వివరించారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల గురించి ఎంఎల్హెచ్పి కుసుమ వివరించారు. కార్యక్రమంలో మహిళలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే : ఎంఎల్ఎ

భీమవరం టౌన్ : విద్యార్థుల భవిష్యత్కు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని, అటువంటి ఉపాధ్యాయులు జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు సాధించడం గొప్ప విశేషమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందిన భీమవరంకు చెందిన మూడేడ్ల వనజాక్షిను మంగళవారం ఎంఎల్ఎ అంజిబాబు అభినందించారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమవరం ఎస్యుఎస్ మున్సిపల్ హైస్కూల్లో గణిత ఉపాధ్యాయురాలు మూడేడ్ల వనజాక్షి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

డిపిఒ ఆకస్మిక పర్యటన

వీరవాసరం : జిల్లా పంచాయతీ అధికారి ఎన్.రామనాథరెడ్డి మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్యంపై ఐవిఆర్ఎస్ కాల్స్ సర్వే పై ప్రజాభిప్రాయం తక్కువగా వచ్చిన గ్రామ పంచాయతీలను ఈ పర్యటనలో డిపిఒ పరిశీలించారు. మడుగు పోలవరం, రాయకుదురు, చింతలకోటిగరువు గ్రామాల్లో పర్యటించారు. ముడుగు పోలవరంలో పారిశుధ్యం పనులను పర్యవేక్షించి అక్కడ సర్పంచి, కార్యదర్శికి పలు సూచనలు చేశారు. రాయకుదురులో నిరుపయోగంగా ఉన్న తాగునీటి చెరువుపై ఆరా తీశారు. సర్పంచి గెడ్డం భారతీ, ఎంపిటిసి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, గ్రామస్తులతో సమావేశం నిర్వహించి చెరువును వాడుకలోకి తీసుకురావడం, పంచాయతీ ఆదాయం పెంచే విధంగా పలు సూచనలు చేశారు. ఈయన వెంట రాయకుదురు కార్యదర్శి సూర్యనారాయణ, ఎంపిటిసి కడలి నెహ్రూలు పాల్గొన్నారు.

ఆదర్శ రైతు రంగరాజు మృతి

పెనుమంట్ర : మండలంలోని పొలమూరుకు చెందిన నూతన పోకడలతో సేంద్రియ, ఆక్వా కల్చర్ సాగులో నైపుణ్యం పొందిన ఆదర్శ రైతు కలిదిండి రంగరాజు(71) మంగళవారం మధ్యాహ్నం అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్లో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు శిరీష్ రాజు జనసేనలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. రంగరాజు టిడిపి ఆవిర్భావం నుండి పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం పొలమూరులో ఆయన భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుమారుడు శిరీష్ రాజు తెలిపారు.

ఉపాధి కార్మికుల బకాయిలు చెల్లించాలి : సిపిఎం

పోడూరు : ఉపాధిహామీ శ్రామికుల వేతన బకాయిలు విడుదల చేయమని, పైఅధికారులకు నివేదిక పంపి తక్షణం పెండింగ్ బకాయిలు విడుదల చేసే మార్గం చూపాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.మోజేష్, సిపిఎం నేతలు కాకర వెంకటేశ్వర్లు, పిల్లి ప్రసాద్, బురాబత్తుల వెంకట్రావు టెక్నికల్ అసిస్టెంట్ టి.బాబురావుని మంగళవారం కలిసి మాట్లాడారు. బాబురావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.1,668 కోట్లు విడుదల చేసిందని మూడు, నాలుగు రోజుల్లో వేతన బకాయిలు శ్రామికుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయని తెలిపారు.

నోటరీగా శ్రీనివాస్



ఆకివీడు : మండలంలో ఇప్పటి వరకు ఒకే ఒక్క నోటరీ అడ్వకేట్ ఉండగా రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయికి అనుగుణంగా రెండో నోటరీ అడ్వకేట్ నియమించింది. 18 సంవత్సరాల సీనియర్ అడ్వకేట్గా ఉన్న చేబోలు శ్రీనివాసును నోటరీగా నియమిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు శ్రీనివాస్ మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తెలియజేశారు.

వెంప రహదారి నిర్మాణం పూర్తి చేయాలి : సిపిఎం

మొగల్తూరు : వెంప ఆర్అండ్బి రహదారి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రహదారి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కోరుతూ మంగళవారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుమారు ఆరు సంవత్సరాల క్రితం ప్రారంభించిన రహదారి నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాకపోవడం చాలా దారుణమన్నారు. రోడ్డు నిర్మాణ పనులను కొనసాగించని కాంట్రాక్ట్పై చర్యలు తీసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కొనసాగించాలని అన్నారు. రహదారి నిర్మాణం పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఐక్యవేదిక సభ్యులు హెచ్చరించారు. ఈ రిలే నిరాహార దీక్షలో ఎడ్ల చిట్టిబాబు, కొత్తపల్లి నాగరాజు, ఒడుగు శ్రీనివాస్, మువ్వల రాజారావు ఉన్నారు.


అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

డాక్టర్ ప్రియాంక వర్మ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నీటిలో పనిచేసే వారికి చర్మవ్యాధులు సోకే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ ప్రియాంక వర్మ పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎస్టిఐ) హబ్ ఆధ్వర్యాన మండలంలోని పెద అమిరం సచివాలయం వద్ద ఉచిత చర్మవ్యాధుల వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్టిఐ హబ్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ జి.హరీష్ కుమార్ వర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక వర్మ మాట్లాడుతూ ఇటీవల కాలంలో నీటిలో పనిచేసే వారిలో ఎక్కువగా తామర వ్యాధి దాదాపు 20 శాతం మంది మధ్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ముందు జాగ్రత్తగా చేతికి గ్లౌజులు ఉపయోగిస్తే కొంత వ్యాధి దరిచేరకుండా చూడవచ్చునని పలు సూచనలు చేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, కెమిస్ట్రీ హెడ్ డాక్టర్ పి.భవాని మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలో సాంకేతిక పరిశోధనలకే కాకుండా సొసైటీకి ఉపయోగపడే విధంగా కూడా కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనలలో భాగంగా తమ కళాశాల కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని ఆయా గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ సిహెచ్.రామబద్రిరాజు పాల్గొన్నారు. డాక్టర్ సుబ్బరాజు కూడా వైద్య సహాయం అందించారు. ఈ సందర్భంగా పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించిన డాక్టర్ ప్రియాంక వర్మను ఎస్టిఐ హబ్ తరపున కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు సత్కరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయున్ని సత్కరిస్తున్న పలువురు

ప్రజాశక్తి - అత్తిలి

మండలంలోని ఉరదాళ్లపాలెం గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ఎస్జిటిగా పనిచేస్తున్న ఎ.అప్పలరాజుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, అదే పాఠశాలలో పనిచేస్తున్న ఎల్.వెంకటేశ్వరరావు నియోజకవర్గ స్థాయిలో బెస్ట్ టీచర్గా ఎన్నికైన సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డివైఇఒ, ఎంఇఒ, క్లస్టర్ హెచ్ఎం, ఎస్ఎంసి కమిటీ, పంచాయతీ పాలకమండలి, కూటమి నాయకులు, గ్రామపెద్దలు, అంగన్వాడీ సిబ్బంది, దాసం బాబ్జి, కాసుల చిన్ని, కూసంపూడి శ్రీను, చవాకుల వేణు, నీతిపూడి శ్రీనివాసు, దాసం లక్ష్మణరావు, సింగంశెట్టి రవి, జీవానందం, ఉపాధ్యాయ సంఘ నాయకులు గణపతి, ప్రసాద్, దుర్గబాబు, రమేష్, వెంకటరావు పాల్గొన్నారు.

పేరు మార్పు / సవరణ

నేను అల్లూరి రాజీవ్ S/o అల్లూరి సత్యనారాయణ రాజు, నివాసం : డోర్ నెం. 2-238/2, నారీన్ హోమ్స్, గార్డెన్నెస్ట్, ప్లాట్నెం.202, సి, 3వ ఫ్లోర్, వేంపాడు రోడ్డు, చినామీరం రూరల్, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా. ప్రస్తుతం నా కుమారుడి ఆధార్కార్డులో **అల్లూరి ప్రణీత్వర్మ S/o అల్లూరి రాజీవ్** అని తప్పుగా నమోదు కాబడినది. ఇప్పుడు పుట్టినతేదీ సర్టిఫికెట్ ప్రకారం నా కుమారుడి పేరు **అల్లూరి ప్రణవ్ వర్మ S/o అల్లూరి రాజీవ్** (ALLURI PRANAV VARMA S/o ALLURI RAJEEV)గా మార్పు చేయుట జరిగినది. కావున నేటి నుండి నా కుమారుడి పేరు **అల్లూరి ప్రణవ్ వర్మ**గా పిలవబడును. ఆధార్లో మార్పు కొరకు

రణ భేరి పోస్టర్ ఆవిష్కరణ

యలమంచిలి : రాష్ట్రంలో విద్యారంగ, ఆర్థిక సమస్యల పరిష్కారానికై యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో రణభేరి ప్రచార జాతాలను నిర్వహిస్తుందని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతి కుమార్ తెలిపారు. మేడపాడు సెంటర్లో యుటిఎఫ్ స్తూపం వద్ద రణభేరీ ప్రచార జాత గోడపత్రికను ఆవిష్కరించారు. యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు గుత్తిందివి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పంతం రామమూర్తి నాయుడు, వెలుగొట్ల జగ్గారావు పాల్గొన్నారు.

పోడూరు/పాలకొల్లు : విద్యార్థులకు, ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన నూతన మూల్యాంకన విధానాలు, తదితర అన్ని విద్యారంగ, ఆర్థిక రంగ అపరిష్కృత సమస్యలపై ఈనెల 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు మండలాల్లో పర్యటించి ఉద్యమానికి శ్రీకారం చుడతామని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.రాజశేఖర్ చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు డి.క్షేమమూర్తి, జెడ్పిహెచ్ఎస్ గుమ్మలూరు హెచ్ఎం కె.బేబీ విజయలక్ష్మి, యుటిఎఫ్ నాయకులు కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

భవ్య భీమవరంలో భాగంగా పట్టణ సుందరీకరణకు చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కాస్మోపాలిటన్ క్లబ్ సహకారంతో చేపట్టిన వంశీకృష్ణ పార్క్ అభివృద్ధి పనులను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. అభివృద్ధి పనులు ఏవిధంగా జరుగుతున్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి, మున్సిపల్ డిఇ టి.త్రినాథ్రావు, వై.శ్రీనివాస్ ఉన్నారు.

మల్టీపర్పస్ గోడౌన్లను వినియోగంలోకి తీసుకురావాలి

జిల్లాలో నిర్మాణం పూర్తయిన మల్టీపర్పస్ గోడౌన్లను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సహకార శాఖలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. జిల్లాకు నాబార్డ్ మంజూరు చేసిన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 24 మల్టీ పర్పస్ గోడౌన్స్లో 14 పూర్తి చేయడం జరిగిందని, ఇంకా 10 గోడౌన్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే పూర్తయిన గోడౌన్లను తక్షణమే వినియోగంలో తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా సహకార శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, మత్స్య శాఖ ఎడి ప్రసాదరావు పాల్గొన్నారు.

లింక్ డాక్యుమెంట్స్ పోయినవి

ఏలూరు జిల్లా, టీ నర్సాపురం మండలం, మక్కినవారిగూడెం గ్రామ కాపురస్థులు విస్సావఝుల ప్రతాప్ శర్మ, S/o. ప్రభాకర్ శాస్త్రి అనే నాకు విస్సావఝుల వరలక్ష్మి గారు వ్రాసి ఇచ్చిన లింక్ డాక్యుమెంట్ నేను లోన్ నిమిత్తం సత్తుపల్లి వెళ్ళు ప్రయాణం లో న డాక్యుమెంట్స్ పోయాయి. **దాక్యుమెంట్స్ నెంబర్ 821/2007** ఎవ్వరికైనా దొరికిన యెడల క్రింది ఫోన్ నెంబర్ కు సంప్రదించగలరు.

సెల్ నెం: 98482 77088

మహారాజశ్రీ ఏలూరు 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో,

I.A.No. 201/2024 in O.S.No. 645/2024

Between:

బచ్చు సత్యనారాయణ,
ప్రొ॥ శ్రీలలితా టింబర్ డిపో, ఏలూరు ...పిటీషనర్/వాది
మరియు
తోట కోదండ వెంకట సత్యనారాయణరావు
వగైరాలు ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

To:
R-3) నరాలశెట్టి బాలసుబ్రమణ్యం, S/o. మస్తాన్, C/o. తోట కోదండ వెంకట సత్యనారాయణరావు, డోర్ నెం: 22C-11-35, చుందూరి వారి వీధి, పవర్పేట, ఏలూరు.

పిటీషనరు తాము వ్యాపారం చేయుచున్న శ్రీ లలితా టింబర్ డిపో, ఏలూరు ప్రాంగణములోనికి మీ మరియు అనుచరుల అక్రమ మరియు దౌర్జన్య ప్రవేశములను నిరోధించుటకు ఇంజక్షన్ ఉత్తర్వులు జారీచేయుటకు పై గ్రంధమును దాఖలు చేసినారు. సదరు పిటీషనులో మీకు ఎన్నిసార్లు నోటీసు జారీ చేసిననూ, మీరు అందుకొనక కాలయాపన చేసినందున ఈ పత్రికా ప్రకటన ద్వారా సమన్లు అమలు చేయవలసినదిగా శ్రీ కోర్టువారు ఉత్తర్వులు జారీ చేసినారు. కావున మీరు **ది. 22-09-2025 తేది ఉదయం గం. 10:30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల సదరు గ్రంధము మీ పరోక్షమున తీర్మానించబడును

వాయిదా తేది: 22-09-2025

చదలవాడ వెంకట రమణారావు
అడ్వకేట్, ఏలూరు
ఏలూరు
ది.09-09-2025
సెల్: 93473 77424

పలుచోట్ల పొలం పిలుస్తోంది


ఉండి : మాట్లాడుతున్న ఎఒ శ్రీనివాసు

ఉండి : మండలంలోని చెరుకువాడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నానో యూరియా వాడడం వల్ల కలిగే ఉపయోగాలు, నానో యూరియా ప్రాముఖ్యం గురించి మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాసు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ యూరియాను రెండు నుంచి మూడు దఫాలుగా పంటకు పైపాటుగా వేస్తారు. అయితే ఈ ఎరువు వినియోగ సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల వేసిన యూరియాలో నత్రజని కేవలం 30 నుంచి 50 శాతం మాత్రమే పంట ఉపయోగపడుతుంది, మిగిలిన ఎరువు అమోనియా లేదా నైట్రేట్ ఆక్సైడ్ రూపంలోనూ మార్చుకొని గాల్లో కలిసిపోతుందన్నారు. బస్తాలలో యూరియాని ఎక్కువగా వాడడం వల్ల పంటలకు సంబంధించి పురుగులు, తెగుళ్లకు పంట ఎక్కువగా లోనవుతుందని, పంట పరిపక్వత ఆలస్యం అవుతుందని అధిక పెరుగుదల కారణంగా పంట పడిపోవడం జరుగుతుందని నిమ్మల శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు గంగాధర్, త్రిమూర్తులు, మల్లేశ్వరరావు, గంగయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

నరసాపురం : మండలంలోని కొప్పర్రు, కంసాల బేతపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కొప్పర్రు సొసైటీ భవనంలో రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి అడబాల జ్యోషిల మాట్లాడుతూ ఈనెల 11, 12 తేదీల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులందరూ 11వ తేదీన తమ పొలాల గట్ల చుట్టూ ఉన్న బొరియలను గుర్తించి 12వ తేదీన వ్యవసాయ శాఖ వారు ఉచితంగా బ్రొమోడియాలెన్ విషపు ఎరా ఎలుకల మందును సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రైతులందరూ తమ రైతు సేవ పరిధిలో అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

డాక్యుమెంట్స్ పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, భోగాపురం కు చెందిన పామర్తి రంగారావు, తండ్రి: పామర్తి నారాయణ గారి వ్యవసాయభూమి దస్తావేజులు **Doc.No: 6468/1985** మరియు **Doc.No: 6469/1985** ది. 29-08-2025 న ఏలూరు రిజిస్ట్రార్ ఆఫీస్ సమీపంలో సదరు డాక్యుమెంట్స్ జిరాక్స్ తీయించుకుని కోర్టు సెంటరుకు వచ్చుచుండగా సదరు దస్తావేజులు ఉన్న ఫైల్ మార్గం మధ్యలో పడిపోయినది. కావున సదరు డాక్యుమెంట్స్ **No: 6468/1985** మరియు **No: 6469/1985** ఉన్న ఫైల్ దొరికిన వారు ఈ క్రింది అడ్రస్కి అందచేయగలరని కోరుచున్నాను.

పామర్తి రంగారావు
భోగాపురం
పశ్చిమ గోదావరి జిల్లా
సెల్ నెం: 77298 42022

డాక్యుమెంట్స్ పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, సత్రంపాడు కు చెందిన భరత్బాబు అంబటి, S/o. జగన్మోహనరావు గారి వ్యవసాయభూమి దస్తావేజులు **Doc.No: R.S.No: 1005/1** మరియు **Doc.No: R.S.No: 1006/4A, 1-421/2** ది. 28-08-2025 న ఏలూరు రిజిస్ట్రార్ ఆఫీస్ సమీపంలో సదరు డాక్యుమెంట్స్ జిరాక్స్ తీయించుకుని కోర్టు సెంటరుకు వచ్చుచుండగా సదరు దస్తావేజులు ఉన్న ఫైల్ మార్గం మధ్యలో పడిపోయినది. కావున సదరు డాక్యుమెంట్స్ **Doc.No: R.S.No: 1005/1** మరియు **Doc.No: R.S.No: 1006/4A** ఉన్న ఫైల్ దొరికిన వారు ఈ క్రింది అడ్రస్కి అందచేయవలసిందిగా కోరుచున్నాను.

భరత్బాబు అంబటి
S/o. జగన్మోహనరావు
సత్రంపాడు, ఏలూరు, ప॥గో॥జిల్లా
సెల్ నెం: 82915 71689

మహారాజశ్రీ ఏలూరు 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో,

O.S.No. 645/2024

Between:

బచ్చు సత్యనారాయణ
ప్రొ॥ శ్రీలలితా టింబర్ డిపో, ఏలూరు ...వాది
మరియు
తోట కోదండ వెంకట సత్యనారాయణరావు
వగైరాలు ...ప్రతివాదులు

To:
D-3) నరాలశెట్టి బాలసుబ్రమణ్యం, S/o. మస్తాన్, C/o. తోట కోదండ వెంకట సత్యనారాయణరావు, డోర్ నెం: 22C-11-35, చుందూరి వారి వీధి, పవర్పేట, ఏలూరు.

వాది గారు తాము వ్యాపారం చేయుచున్న శ్రీ లలితా టింబర్ డిపో, ఏలూరు ప్రాంగణములోనికి మీ మరియు అనుచరుల అక్రమ మరియు దౌర్జన్య ప్రవేశములను నిరోధించుటకు పర్మినెంటు ఇంజక్షన్ ఉత్తర్వులు జారీచేయుటకు పై గ్రంధమును దాఖలు చేసినారు. సదరు దావాలో మీకు ఎన్నిసార్లు సమన్లు జారీ చేసిననూ, మీరు అందుకొనక కాలయాపన చేసినందున ఈ పత్రికా ప్రకటన ద్వారా సమన్లు అమలు చేయవలసినదిగా శ్రీ కోర్టువారు ఉత్తర్వులు జారీ చేసినారు. కావున మీరు **ది. 22-09-2025 తేది ఉదయం గం. 10:30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల సదరు గ్రంధము మీ పరోక్షమున తీర్మానించబడును

వాయిదా తేది: 22-09-2025

చదలవాడ వెంకట రమణారావు
ఏలూరు — అడ్వకేట్, ఏలూరు
ది.09-09-2025 — సెల్: 93473 77424

బహిరంగ వేలం ప్రకటన

మహారాజశ్రీ ప.గో.జిల్లా., ఏలూరు ఒకటి అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

E.P.No.193/2024 in O.S.No.92/2015

బిట్వీన్ :
జి.జనార్దన్ ...డిక్రీ హోల్డర్
మరియు
బెజవాడ ప్రభాకర్ మరియు వగైరా ...జడ్జిమెంట్ డెటార్సు

పై నెంబరు దాఖలా వారంటు గ్రంథములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఈ దిగువ ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారు తేది.25-09-2025వ తేదీ ఉదయం గం.10.30 ని॥లకు బహిరంగంగా వేలం వేయుదురు. కావలసిన వారు సదరు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును. వాది/డిక్రీ హోల్డర్ తరుపు దాఖలు చేసిన ఇ.పి షెడ్యూలు దాఖలా ఆస్తి.

Item No.1 : ప.గో.జిల్లా. (ప్రస్తుత ఏలూరు జిల్లా), వట్లూరు సబ్ రిజిస్ట్రార్ వారి యిలూ పెదపాడు మండలం, కొక్కిరపాడు గ్రామము, కొక్కిరపాడు పంచాయితీలో ఆర్.యస్.నెం.175/3లో య.0.50 సెంట్లు జడ్జిమెంట్ డెటార్సు సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములో వుండి ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు చార్జీ కాబడి వేలం కావలసియున్న ఆస్తికి హద్దులు :
తూర్పు : Land of Executed in this Survey No.
పశ్చిమ : Land of Pinamaneni Pitchiyya and ....
ఉత్తరం : Land of Garapati Krishna Rao & Others
దక్షిణం : Land of Survey No.175/4 of Executent

Item No.2 : ప.గో.జిల్లా (ప్రస్తుతం ఏలూరు జిల్లా) వట్లూరు సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా పెదపాడు మండలం కొక్కిరపాడు గ్రామము, కొక్కిరపాడు పంచాయితీలో ఆర్యస్నెం.175/3లో య.0.50 సెంట్ల జడ్జిమెంట్ డెటార్సు సంపూర్ణ హక్కు భుక్తములో వుండి ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు కాబడి వేలం కావలసియున్న ఆస్తికి హద్దులు :
తూర్పు : Land of Garapati Krishna Rao
పశ్చిమ : Land of Claiment
ఉత్తరం : Land of Ganapati Krishna Rao & Others
దక్షిణం : Land of Bejawada Veera swamy

అమీనా కిమ్మత్తు : Item No.1 Rs.9,00,000/-
డిక్రీ హోల్డర్ కిమ్మత్తు : Item No.1 Rs.20,00,000/-
అమీనా కిమ్మత్తు : Item No.2 Rs.9,00,000/-
డిక్రీ హోల్డర్ కిమ్మత్తు : Item No.2 Rs.20,00,000/-

అంబటి మణికుమార్
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 9441640035.

శ్రీ శోభనాచల & మల్లిఖార్జున స్వామి వార్ల దేవస్థానం

ఆగిరిపల్లి గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా.
దేవదాయ, ధర్మాదాయశాఖ - భూమి కౌలు హక్కు

బహిరంగ వేలం ప్రకటన

ఆగిరిపల్లి గ్రామము మరియు ఆగిరిపల్లి మండలం, **శ్రీ శోభనాచల మరియు మల్లిఖార్జున స్వామి వార్ల దేవస్థానం** తాలుకా భూమి ఆగిరిపల్లి గ్రామము లోని ఈ దిగువ ఉదహరించిన మెరక భూమికి 3 సంవత్సరముల కాల పరిమితికి ది.17-09-2025 నుండి 16-09-2028 వరకు లీజుకు ఇచ్చుటకు దేవాదాయశాఖ అధికారుల సమక్షములో బహిరంగ వేలం నిర్వహించబడును.

వివరములు	తేదీ సమయం బహిరంగ వేలం సొమ్ము నిలిపి వుంచు ప్రదేశం	ధరావత్తు	కాలపరిమితి
1. R.S.No. 106/2 య.3:64 Cts	ది.17-9-2025 దేవస్థానం కార్యాలయము నందు ఉ॥10 గం॥లకు	12,000/-	2025-2026 నుండి 2027-2028 17-9-2025 to 16-9-2025

తేది : 6-9-2025 **కార్యనిర్వహణాధికారి, సెల్: 9848146455**